జననినాదం

www.jananinadam.com

Follow :

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

శుక్రవారం 20-11-2026

సంపుటి : 2 సంచిక : 191

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 06

వెల: రూ.2.00

Simultaneously published from
,Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాటలను పరిశీలిస్తాం

: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



2వ పేజీలో...

హైదరాబాద్ 19: అధికారముంది కదా అని నేనేం ఏది చేసినా నడుస్తనుకుంటే మాత్రం ఖబడ్దార్ బిడ్డా రేవంత్ రెడ్డి.. చెప్తున్నా యుద్దం స్టార్ట్ అయితది. మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరంటూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారని తెలిసిందే. నాలుగు గోడల మధ్య రిప్రజెంటేషన్ ఇస్తేనేమో మీరు పట్టించుకుంటలేరాయే.. బయట మాట్లాడితేనేమో క్రమశిక్షణ అంటారని రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో

భారత్ ఇప్పుడు సరికొత్త ఆట ఆడుతోంది

- వికసిత్ భారత్ 2047 వాయిస్ ఆఫ్ యూత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ

- విపక్షాల వ్యవహారశైలిని గ్రాండ్ థెఫ్ట్ ఆటో వీడియో గేమ్‌తో పోల్చిన ప్రధాని

- టెక్నాలజీని వాడుకుని ఫేక్ వీడియోలతో క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తున్నారని ఆరోపణ



2వ పేజీలో...

దేశం ఇప్పుడు సరికొత్త లక్ష్యాలతో, కొత్త నిబంధనలతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్ ఏ 2047: వాయిస్ ఆఫ్ యూత్' వర్క్‌షాప్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన ఆయన, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాల వ్యవహారశైలిని ప్రముఖ వీడియో గేమ్ 'గ్రాండ్ థెఫ్ట్ ఆటో' (జీటీఏ)తో పోల్చారు. "వీడియో గేమ్‌ల ప్రపంచంలో జీటీఏ గురించి మనకు తెలుసు. అందులో ప్లేయర్ ఏమైనా చేయవచ్చు. ఏది పడితే అది లాక్కోవచ్చు, దేన్నైనా నాశనం చేయవచ్చు. అదే విధమైన 'అపరిమిత' స్వేచ్ఛను కొందరు వ్యక్తులు దేశానికి వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారు. సాంకేతికతను ఆసరాగా చేసుకుని ఎవరిపై పడితే వారిపై క్యారెక్టర్ అసాసినేషన్ ప్రచారం చేస్తున్నారు. ఫేక్ వీడియోలతో తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు" అని మండిపడ్డారు. కేవలం రాజకీయ శత్రుత్వంతో కొందరు వ్యక్తులు, కొన్ని పార్టీలు దేశ మనోధైర్యాన్ని, ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తూ

ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను



- రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనన్న సిద్ధరామయ్య

- వయోభారం వల్లే పోటీకి దూరంగా ఉంటున్నట్లు వెల్లడి

- సోనియా పుస్తకావిష్కరణ సభలో సీటింగ్ వివాదంపై స్పష్టీకరణ

- సభకు ఆలస్యంగా వెళ్లడం వల్లనే వెనుక వరుసలో కూర్చున్నానని వివరణ

బెంగళూరు 19:పార్టీ అధిష్ఠానం తనను చిన్నచూపు

2వ పేజీలో...

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2వ పేజీలో...



హైదరాబాద్19: హైదరాబాద్ హైటెక్స్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సును ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో కలిసి ప్రారంభించారు.ఈ సదస్సులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి విషయాల్లో రాజకీయాలకు తావు లేకుండా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి మిగిలిన సమయం దేశాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన

విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

- తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూత

- హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

- తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయిందంటూ కేసీఆర్ ఆవేదన

2వ పేజీలో...



మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాటి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయం నుంచి విద్యాసాగర్‌తో తనకు ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "వరంగల్ కేంద్రంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యాసాగర్ మరణంతో తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయింది" అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వరంగల్ వేదికగా సాగిన పోరాటాల్లో, ముఖ్యంగా వరంగల్ తూర్పు

టాక్స్ తగ్గించాం.. మరి జీతాలు పెంచారా?

భారత పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సూటి ప్రశ్న!

- ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన ప్రధాని మోదీ

-సంస్కరణల ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన

- ఉద్యోగుల వేతనాలను ఎంత పెంచారో పరిశ్రమలు నిరూపించుకోవాలని వెల్లడి

- దేశీయ వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యత ఇవ్వాలని ఆదేశం

- ఫార్మా ఏపీఐలు, స్టీల్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపు



2వ పేజీలో...

కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు

హరీశ్ రావు అవినీతిపై చర్యలేవి?

: సీఎంఓకు పంపిన లేఖలు 'ఎక్స్'లో కవిత

హైదరాబాద్, నవంబరు 19: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన వేళ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) తాను అందజేసిన ఫిర్యాదు పత్రాలను ఈరోజు ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు."అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారు సీఎం గారూ?" అంటూ కవిత నేరుగా రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 14న సీఎంఓకు సమర్పించిన ఈ లేఖలను అధికారులు నవంబర్ 18న స్వీకరించారు.



కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ మార్పులు, పంప్ హౌస్ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని ఆమె ఆరోపించారు."సిద్ధిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో జరిగిన అవినీతి, డిజైన్ మార్పు, నాణ్యతా లోపాలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చిన అంశాలపై

రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు

గజాలను కూడా వదిలిపెట్టడం లేదు

ట్రక్ పార్కు భూమి వేలాన్ని రద్దు చేయాలి ..మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

2వ పేజీలో...



హైదరాబాద్19: కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూమి అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో హరీష్ రావుమాట్లాడుతూ.. సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు, రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు. భూముల అమ్మకంపై ఉన్న శ్రద్ద పాలనపై లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

గతంలో ప్రభుత్వాలు భూములు అమ్మితే నిరర్థక ఆస్తులు, ప్రజలకు ఉపయోగపడని భూములును అమ్మేవి.కానీ రేవంత్ మాత్రం అందుకు విరుద్దంగా వ్యవహరిస్తున్నాడు. కూకట్ పల్లి ట్రక్ పార్కింగ్ భూమి అనేది ప్రభుత్వ భూమి కాదు. ట్రక్ పార్కింగ్ భూమి. ప్రభుత్వ రికార్డుల్లోనూ అదే ఉంది.ఒక ప్రత్యేకమైన అనవరం కోసం ఆనాడు భూమి సేకరించడం జరిగింది. పబ్లిక్ పర్పస్ కోసం, ట్రక్ పార్కింగ్ కోసం అని ఆర్డర్ ఉంది.ఇప్పుడు దాన్ని పక్కనబెట్టి అమ్మేస్తాం అంటున్నారు. ల్యాండ్ అక్విజేషన్ యాక్ట్ ప్రకారం, తిరిగి రైతులకు ఇవ్వాలి తప్ప ఇష్టం ఉన్నట్లు వినియోగించడం కుదరదని అన్నారు.26 వేల ఎకరాల భూమి ఇప్పటికే అమ్మిండు, 20 వేల ఎకరాల భూమిని

మంత్రి పొన్నం ను కలిసిన ఆర్టీసి ఎండి



హైదరాబాద్19: హైదరాబాద్‌లో ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు తీరు, మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సుల నిర్వహణపై సమీక్షించారు. అలాగే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెంపు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నూతన బస్సుల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడం, ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో పెంపు, సంస్థ ఆర్థిక బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అనిల్ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీని దేశంలోనే ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

భారత్ ఇప్పుడు సరికొత్త ఆట ఆడుతోంది

మొదటిపేజీ తరువాయి...

అన్ని హద్దులూ దాటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, భారత్ పాత పద్ధతులను దాటి సరికొత్త ఆట ఆడుతోందని మోదీ పేర్కొన్నారు. నేడు దేశంలోని ప్రతి యువకుడు సరికొత్త ఆశయాలతో, సరికొత్త లక్ష్యంతో ఆలోచించాలని, నేటి భారత్‌కు కొత్త లక్ష్యాలు, కొత్త రూల్స్ ఉన్నాయని స్పష్టం చేశారు. రాబోయే 25 ఏళ్ల కాలం దేశ చరిత్రలో కీలకమైన 'అమృత కాలం' అని, 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల వేళ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ప్రధాని వివరించారు. గవర్నర్లు, వైస్ ఛాన్సలర్లు పాల్గొన్న ఈ వర్క్‌షాప్ ద్వారా దేశ నిర్మాణానికి అవసరమైన వినూత్న ఆలోచనలను ప్రత్యేక పోర్టల్ ద్వారా పంచుకోవాలని ప్రధాని యువతకు పిలుపునిచ్చారు.

విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

మొదటిపేజీ తరువాయి...

నియోజకవర్గంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించడంలో ఆయన పోషించిన పాత్ర ఎనలేనిదని గుర్తుచేశారు. అచ్చా విద్యాసాగర్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి, పార్టీకి విద్యాసాగర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన మరణం పార్టీకి, ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యమ కాలం నుంచి నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నేత విద్యాసాగర్ మృతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను

మొదటిపేజీ తరువాయి...

చూడలేదని స్పష్టీకరణవచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసే ప్రసక్తే లేదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తనకు ప్రస్తుతం 80 ఏళ్లు వచ్చాయని, ఈ వయసులో ఎన్నికల బరిలోకి ఎలా దిగుతానని ఆయన ప్రశ్నించారు. మైసూర్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తన నిర్ణయానికి వయసే ప్రధాన కారణమని పునరుద్ఘాటించారు. ఆయన మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనుచరులు ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పుస్తకావిష్కరణ సభలో తనకు జరిగినట్లుగా ప్రచారంలో ఉన్న 'సీటింగ్ అవమానం'పై సిద్ధరామయ్య స్పష్టతనిచ్చారు. ఆ కార్యక్రమంలో ఆయనకు ఐదో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన్ను పక్కనపెట్టిందంటూ విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై స్పందించిన ఆయన.. పార్టీ నాయకత్వం తనను ఏమాత్రం చిన్నచూపు చూడలేదని కొట్టిపారేశారు. సభా ప్రాంగణానికి తనే ఆలస్యంగా వెళ్లానని, అందుకే వెనుక వరుసలో కూర్చోవాల్సి వచ్చిందని, అంతకుమించి ఇందులో ఎలాంటి రాజకీయ వివాదం లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో విభేదాల కారణంగానే సిద్ధరామయ్యను పార్టీ పక్కనపెడుతోందంటూ కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అధిష్ఠానం ఆయనకు తీరని అన్యాయం చేస్తోందంటూ సానుభూతి వ్యక్తం చేశారు. అయితే ప్రత్యర్థుల ఆరోపణలను సిద్ధరామయ్య పూర్తిగా తోసిపుచ్చారు. అయినప్పటికీ వచ్చే ఎన్నికలకు దూరంగా ఉంటానని ఆయన పదేపదే ప్రకటిస్తుండటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాటలను పరిశీలిస్తాం

మొదటిపేజీ తరువాయి...

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం రిపోర్ట్ అడుగగా.. రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోలను టీపీసీసీ అధిష్టానానికి పంపింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయం పరిశీలిస్తున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ అన్నారు. సమయం వచ్చినప్పుడు అందరినీ పిలుస్తాం..అన్నీ కూడా నిశితంగా పరిశీలిస్తున్నాం.. క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని.. రాజగోపాల్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏ సందర్భంలో ఏం మట్లాడారో.. అన్ని మాటలను పరిశీలిస్తామని చెప్పారు. ప్రతీ దానికి ఓ సమయం ఉంటదని చెప్పుకొచ్చారు.

రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు

గజాలను కూడా వదిలిపెట్టడం లేదు

మొదటిపేజీ తరువాయి...

బాంబే స్టాక్ ఎక్సేంజీలో కుదువ పెట్టి బ్రోకర్కు 500 కోట్ల లంచం ఇచ్చి 20 వేల కోట్లు అప్పు తెచ్చిండు. హెచ్ఎండీఏలో 800 ఎకరాల భూముల విషయంలో అదే బ్రోకర్ కు 250 కోట్లు లంచం ఇచ్చి 10వేల కోట్లు అప్పు తెచ్చిండు.చరిత్రలో ఎన్నడూ లేనిది బ్రోకర్లకు 500 కోట్ల లంచం అధికారికంగా ఇచ్చి భూములు అమ్ముతున్నడు.మియాపూర్ లో 400, మామిడిపల్లిలో 400 ఎకరాలు అమ్ముతా అంటున్నడు.అంటే 50 వేల కోట్ల భూములను ఈ సంవత్సరం అమ్మాలని టార్గెట్ పెట్టుకున్నడు.కమీషన్ల కోసం కాంట్రాక్టుల కోసం అమ్ముతున్నడు తప్ప ప్రజల కోసం కాదు. గ్యారెంటీల అమలు మరిచిపోయి, భూములను గ్యారెంటీగా అమ్ముతున్నడు.కాప్రాలో 400 గజాలు, అమీన్ పూర్ లో 300 గజాలు, బాచుపల్లిలో 490 గజాలు.. ఇలా గజాలను కూడా వదిలిపెట్టడం లేదని అన్నారు.నేడు ఎల్లినో కరువుకు నీళ్ల కరవు వస్తే, రేవంత్ పిచ్చి తుగ్లక్ చర్య వల్ల భూముల కొరత వచ్చే ప్రమాదం ఉంది.తిక్కలోడు తిరునాళ్లకు పోతే ఎక్కడానికి దిగడానికే సరిపోయింది అన్నట్లుంది రేవంత్ పాలన. ఫిక్ పోలీసు స్టేషన్ భూమి, నర్సరీ, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు, ఆర్టీఏ కార్యాలయం అక్కడే ఉంది. వాటన్నింటిని అమ్మేస్తావా.రేవంత్ గతంలో మాట్లాడిన మాటలు వింటే ఊసరవెల్లి కూడా ఉరి వేసుకుంటుంది. క్షణమే కూకట్ పల్లి వద్ద ట్రక్ పార్కు భూమి వేలాన్ని రద్దు చేయాలని అఖిలపక్షం పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ వేలాన్ని రద్దు చేయకుంటే 22, 23 తేదీల్లో జరిగే నిరాహార దీక్షలో బీఆర్ఎస్ ప్రత్యక్షంగా పాల్గొంటుంది. 25వ తేదీ హెచ్ ఎం డీఏ ముట్టడిలో బీఆర్ఎస్ పాల్గొంటుంది. ట్రక్ పార్క్ అనేది వేలాది మంది ప్రజలకు బతుకుదెరువు. వేలాది మంది జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉంది.పదేళ్ల ముందు బీఆర్ఎస్ ఈ భూములను కాపాడింది, నేడు మళ్లీ బీఆర్ఎస్ పోరు బాట పట్టింది. కార్మికుల కోరిక మేరకు మేం పూర్తి మద్దతు అందిస్తున్నాం. రాహుల్ గాంధీ గారు ప్రభుత్వ రంగం సంస్థలను, ప్రభుత్వ భూములను అమ్మొద్దు అని చెబుతుంటే రేవంత్ అదే పనిగా భూములు అమ్ముతున్నడు. రాహుల్ మాటకు విలువలేదా కాంగ్రెస్ పార్టీ ఆలోచించుకోవాలి. హైకమాండ్ చొరవ చూపి రేవంత్ కు బుద్ధి చెప్పాలి. లేకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుంది. ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. సీపీఐ, సీపీఎం సహా అన్ని వామపక్షాలు కలుపుకొని బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం

మద్దతుగా నిలవాలిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

ఆవశ్యకతను నొక్కిచెప్పారు.తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే అనేక సందర్భాల్లో అందించామని గుర్తుచేస్తూ వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం సైతం స్పష్టమైన విధానాలతో ముందుకు వెళుతోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ తనవంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. కేంద్రం కూడా తనవంతుగా రాష్ట్రానికి సహకారం అందించాలి. అందుకోసం తెలంగాణను మూడు జోన్లుగా విభజన చేసి లక్ష్యాలను నిర్దేశించాం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని సర్వీస్ సెక్టార్‌గా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నాం.ఆయా రంగాలు అభివృద్ధి సాధించడానికి రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకు పటిష్టమైన రోడ్ నెట్‌వర్క్ ఉండాలి. ప్రధానంగా నగరాలు, గ్రామాలతో పాటు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తూ రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతాయి. తద్వారా వ్యాపార, వాణిజ్య రంగాలు వృద్ధి సాధిస్తాయి.మౌలిక సదుపాయాల కల్పనలో రోడ్లు మాత్రమే కాకుండా హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో కూడా తెలంగాణ ఎన్నో కీలకమైన చర్యలు చేపట్టింది. హెల్త్ కేర్ ప్రాధాన్యత దృష్ట్యా పురాతన ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని అత్యంత అధునాతన వసతులతో నిర్మిస్తున్నాం. అలాగే రాష్ట్రంలోని టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తంగా 8 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రులను నిర్మిస్తున్నాం అని ముఖ్యమంత్రి వివరించారు.



హరీశ్ రావు అవినీతి పై చర్యలేవి?

మొదటిపేజీ తరువాయి...

చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వరకు నీటిని తరలించే కాలువ డిజైన్‌లో మార్పులు, పంప్ హౌస్ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం" అని కవిత తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

టాక్స్ తగ్గించాం.. మరి జీతాలు పెంచారా?

మొదటిపేజీ తరువాయి...

కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్ గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వర్గాలకు సూచించారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

అర్హులందరికీ చేయూత పెన్షన్లు
కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ ... మంత్రి సీతక్క

హైదరాబాద్,19: మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.63 లక్షల మందికి చేయూత పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తామని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకే ప్రభుత్వం చేయూత పెన్షన్లు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యత మేరకు అర్హులైన పేద కుటుంబాలను ఆదుకుంటున్నామని తెలిపారు.మహిళలు మహిళా సంఘాల్లో చేరి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఒక్కో మహిళా సంఘానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు.



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళలకు స్ఫూర్తి అని, ఆమె పేరుతోనే ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళల పేరుతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, హైటెక్ సిటీ సమీపంలో రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళా శక్తి మార్కెట్‌ను మహిళా సంఘాలకు కేటాయించామని వెల్లడించారు.
ఈ నెల 26 నుంచి చేయూత పెన్షన్ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు చిలకపచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు అందించడమే లక్ష్యమని ప్రకటించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ మహిళలకు షాపులు ఏర్పాటు చేయించి, రుణాలు అందించి వ్యాపారాల్లో ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

మానుకోట మార్నింగ్ వాక్ లో పట్టభద్రులతో ఆత్మీయ పలకరింపు

మహబూబాబాద్ 19:పట్టణంలోని జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మాజీ ఎంపీ మాలోతు కవిత ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాక్‌కు వచ్చిన పట్టభద్రులు, నిరుద్యోగ యువత, స్థానిక ప్రజలను ఆత్మీయంగా కలుసుకొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నాను. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మలోత్ కవిత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువకుడు, విద్యావంతుడు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు అండగా నిలవాలని కోరడం ఎంతో సంతోషాన్నిచ్చింది. కాగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైంది. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భరోసా, ఉద్యోగులకు న్యాయం, రైతులకు గిట్టుబాటు ధరలు అందని పరిస్థితి నెలకొందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బిందు , మాజీ మున్సిపల్ చైర్మన్ రామ్ మోహన్ రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భరత్ రెడ్డి , జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ఇంకుడు గుంతల పోటీ

రూ. 10 లక్షల బహుమతులు ప్రకటించిన ఆలివ్ మిఠాయి
పోటీల పోస్టర్‌ను విడుదల చేసిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, నవంబర్ 18: నగరంలో ఇంకుడుగుంతల పోటీని ఆలివ్ మిఠాయి నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న ఆలివ్ మిఠాయి సంస్థ.. వర్షపు నీటిని ఆదా చేద్దాం! ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను కాపాడుకుందాం! అనే నినాదంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆలివ్ మిఠాయి – ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమం పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు బుధవారం హైడ్రా కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్షాకాలం వరదలు తగ్గాలన్నా.. వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారించాలన్నా ఇంకుడు గుంతల ఆవశ్యకత ఎంతో ఉందని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అన్నారు. వర్షం నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపిస్తే భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకున్నా.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటే నీటి ఇబ్బందులనుంచి చాలా వరకు బయట పడే అవకాశం ఉందన్నారు. రూ. 10 లక్షల బహుమతులు.. ఇంకుడు గుంతను తవ్వి.. ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో ఏనీచేసి, ఫాలో చేయాలని ఆలివ్ మిఠాయి సంస్థ యజమాని శ్రీ దొర రాజుగారు సూచించారు. మాకు వచ్చిన వీడియోల్లో అత్యధిక వ్యూస్ సాధించిన వీడియోలకు రూ. 10 లక్షల బహుమతులు అందజేస్తామన్నారు. మరియు సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాయన్నారు. మొదటి బహుతికి రూ. 5 లక్షలు, రెండో బహుతికి రూ. 3 లక్షలు, మూడో బహుమతికి రూ. 2 లక్షలు అందజేస్తున్నామన్నారు. వర్షపు నీటిని ఒడిచి పట్టేలా నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్న హైడ్రాకు శ్రీ దొర రాజు ధన్యవాదాలు తెలిపారు. నగర చెరువుల రూపురేఖలను మారుస్తున్న హైడ్రా కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు. బహుమతులను కూడా హైడ్రా కమిషనర్ చేతుల మీదుగా అందజేస్తామని ప్రకటించారు.



సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జనినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 19: జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించి భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన రికార్డులు రూపొందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులలో భాగంగా గురువారం భీమిని మండలం రాజారాం గ్రామంలో నిర్వహించిన సదస్సుకు బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసీల్దార్ బికర్ణదాస్, కన్నెపల్లి మండలం నాగపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు సబ్ కలెక్టర్, మండల తహసీల్దార్ రామచందర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల కొలతలలో వ్యత్యాసాలు, సర్వే నంబర్లలో గందరగోళం, భూముల హద్దుల విషయంలో రైతుల మధ్య తలెత్తుతున్న వివాదాలు, ఒకరి భూమిలోకి మరొకరు ఆక్రమణలు జరగడం వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందని తెలిపారు. గతంలో భూముల కొలతలు, పట్టా రికార్డులు, వాస్తవ సాగులో ఉన్న భూముల విస్తీర్ణం మధ్య వ్యత్యాసాలు ఉండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సర్వే ద్వారా వాస్తవ పరిస్థితులను గుర్తించి పారదర్శకమైన భూ రికార్డులు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు జెండాలను అందజేయడం జరుగుతుందని, సంబంధిత భూముల సర్వే తేదీకి రెండు రోజుల ముందుగానే రైతులు తమ భూముల 4 వైపులా జెండాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో భూములను కొలతలు వేసి, ఖచ్చితమైన హద్దులు గుర్తించి డిజిటల్ మ్యాపులను రూపొందిస్తారని తెలిపారు. భూములకు సంబంధించిన కో-ఆర్డినేట్స్ ఆధారంగా భవిష్యత్తులో ఎప్పుడైనా భూముల హద్దులను గుర్తించే అవకాశం ఉంటుందని, తద్వారా భూ ఆక్రమణలు, హద్దుల వివాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి విస్తీర్ణం, అందులో ఉన్న పట్టాదారులు, వారి భూముల వివరాలను అనునంధానం చేసి సమగ్ర మ్యాపులను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో భూముల కొనుగోలు, అమ్మకాలు, వారసత్వ బదిలీలు జరిగినప్పుడు మ్యాపులలో సంబంధిత మార్పులు సమోదు అవుతాయని, తద్వారా భూ రికార్డులలో పారదర్శకత పెరుగుతుందని వివరించారు. సర్వేలో భాగంగా ప్రభుత్వ భూములు, పట్టా భూములు, లావుని పట్టా భూములకు సంబంధించి వాస్తవ విస్తీర్ణాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లావుని పట్టా భూములకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వాస్తవ స్థితిని పరిశీలించి, నిబంధనల ప్రకారం రికార్డులలో మార్పులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టా భూములలో కొంతమందికి రికార్డుల ప్రకారం ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ, మరికొంత మందికి



తక్కువ భూమి ఉన్నట్లు గుర్తించిన సందర్భాలలో సంబంధిత రైతులకు వివరాలతో కూడిన జాబితా అందజేస్తామని తెలిపారు. రైతులు పరస్పర అంగీకారంతో సమన్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పిస్తామని, అంగీకారం కుదరని పక్షంలో నిబంధనల ప్రకారం వాస్తవ పరిస్థితుల దృష్ట్యా పట్టా హక్కులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య వారసత్వ వివాదాలు, సంతకాల సమస్యలు వంటి సివిల్ వివాదాలు సంబంధిత న్యాయస్థానాల పరిధిలో పరిష్కరించుకోవలసి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 12 గ్రామాలలో భూ సర్వే ప్రక్రియ పూర్తయిందని, దాదాపు 90 నుంచి 95 శాతం వరకు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని, సుమారు 1 వేయి ఎకరాల విస్తీర్ణం ఉన్న గ్రామంలో సర్వే ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం గ్రామంలో రైతుల సమక్షంలో భూముల విస్తీర్ణం వివరాలను వెల్లడించి, వారి సంతకాలు తీసుకోవడంతో పాటు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రైతులందరూ సమగ్ర భూ సర్వే ప్రాముఖ్యతను గుర్తించి, తమ భూములకు సంబంధించిన హద్దులను సక్రమంగా గుర్తించేందుకు అధికారులకు సహకరించాలని, తద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయబద్ధంగా భూ హక్కులు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.భీమిని మండలం రాజారాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని, వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేకల మందలపై అడవి కుక్కల దాడులు

వరుస ఘటనలతో కాపరుల్లో ఆందోళన

మందగూడలో 15 మేకలు మృతి



జనినాదం,తిర్యాణి నవంబరు 19: మండలంలో అడవి కుక్కలు మేకల మందలపై విరుచుకుపడుతున్నాయి. పంగిడి మాధర పరిధిలోని భీంజిగూడ గ్రామ శివారులో తాజాగా మేకల మందపై దాడి చేశాయి. నాలుగు రోజుల క్రితం మందగూడ గ్రామంలో జరిగిన దాడిలో సుమారు 15 మేకలు మృత్యువాత పడ్డాయి. వరుస దాడులతో మేకల కాపరులు బెంబేలెత్తుతున్నారు. మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కాపరులకు ఈ ఘటనలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నాయి. కష్టపడి పెంచుకున్న మేకలు మృత్యువాత పడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి మేకల మందలపై అడవి కుక్కల దాడులను అరికట్టాలని, నష్టపోయిన యజమానులకు ప్రభుత్వం పరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

బడుల్లో సకల సదుపాయాలు కల్పించాలి...

యూడైస్ వివరాల నమోదులో నిర్లక్ష్యం తగదు..

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి...

యుడైస్ అవగాహన సదస్సులో కలెక్టర్ కె.హరిత



జనినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి నవంబరు 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంద శాతం మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూడైస్ అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ నందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, మరుగుదొడ్లు తదితర కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూడైస్ పోర్టల్‌లో పాఠశాల భవనాలు, తరగతి గదులు, విద్యార్థుల వివరాలు, ప్రవేశాలు, వయసు, తరగతి, ఆధార్, అపార్ వివరాలతో పాటు ఉపాధ్యాయుల సర్వీసు, విద్యార్హతలు, పోస్టింగ్ ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా పర్యవేక్షించాలని, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యాబోధన,



మౌలిక వసతుల పరిస్థితిని సమీక్షించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలు, సర్వశిక్ష అభియాన్ కింద మంజూరైన నిధులను పాఠశాలల్లో కనీన వసతుల కల్పనకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ అన్ని సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సర్వశిక్ష ఎంఐఎన్, నీఆర్‌పీలు, నీసీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి విశేష కృషి

తిర్యాణిలో ఘనంగా 109వ జయంతి వేడుకలు




జనినాదం,తిర్యాణి నవంబరు 19: భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ దివంగత ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొట్నాక గణపతి అన్నారు. గురువారం తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ డైరెక్టర్, జవహర్ బాల్ మంచ్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ నైతం రాంచందర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలునుకున్నారు. ఈ నందర్భంగా గణవతి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో సామాన్య ప్రజల అభ్యున్నతికి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు. మహిళా నాయకత్వానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చిన ధైర్యసాహసాల ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నైతం రాంచందర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమె అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దె విజయ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి కొమురయ్య, మాజీ మండల అధ్యక్షుడు అంకం గౌరయ్య, మండల ఉపాధ్యక్షులు ఆత్రం లక్ష్మణ్, చుంచు బాపురావు, ప్రధాన కార్యదర్శులు రాయిసిడం గౌర్యకుమార్, దుర్గం పవన్‌కుమార్, అధికార ప్రతినిధి కూన సురేష్, ఎస్టీ సెల్ నాయకుడు జూగ్నక మారుతి, ఎస్సీ సెల్ నాయకుడు మల్యాల అశోక్, కిసాన్ సెల్ నాయకుడు దూస మధుకర్, సేవాదళ్ నాయకుడు బోరక్కడే శంకర్, తలండి సర్పంచ్ నైతం మంగు, పూసం రాజు, కోవ శంకర్, బుద్దె బానయ్య, సిడం జలపతిరావు, మాడవి సాగర్, పంద్రం యశ్వంత్ రావు, ఆత్రం దౌలత్ రావు తదితరులు పాల్గొన్నారు.

హిమాలయాలే లక్ష్యంగా.. ఎవరెస్ట్‌పై గురి!

యువ పర్వతారోహకుడు గిత్తే కార్తీక్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందనలు

మారుమూల గ్రామం నుంచి పర్వతారోహణలో ప్రత్యేక గుర్తింపు...



జనినాదం,కెరమెరి,సిర్పూర్(యు),నవంబరు 19: మారుమూల గిరిజన గ్రామం నుంచి మొదలైన ప్రస్థానం.. హిమాలయ పర్వత శిఖరాల వరకు సాగుతోంది. పర్వతారోహణలో విశేష ప్రతిభ కనబరుస్తూ జిల్లా ఖ్యాతిని చాటుతున్న యువకుడు గిట్టె కార్తీక్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు. జిల్లాలోని కెరమెరి మండలం కెలికే గ్రామానికి చెందిన కార్తీక్ ఇటీవల ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తన పర్వతారోహణ అనుభవాలు, సాధించిన విజయాలను వివరించారు. ఆయన పట్టుదల, ధైర్యసాహసాలు, కృషిని ఎమ్మెల్యే ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

గ్రేడ్-ఏతో పర్వతారోహణ శిక్షణ..

కార్తీక్ 2022లో సిక్కింలోని హిమాలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకో టూరిజంలో బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సును గ్రేడ్-ఏతో పూర్తి చేశారు. అనంతరం 2023లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ లో అడ్వాన్స్‌డ్ మౌంటెనీరింగ్ కోర్సును సైతం గ్రేడ్-ఏతో పూర్తిచేసి తన నైపుణ్యాన్ని మెరుగుపర్చుకున్నారు.

పలు పర్వత యాత్రల్లో ప్రతిభ..

సిక్కింలోని సుమారు 5,300 మీటర్ల ఎత్తైన ఆల్ట్-22 వర్జిన్ పీక్‌ను అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేశారు. 2025లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ కనామో యాత్రలో పాల్గొని సుమారు 5,900 మీటర్ల ఎత్తుకు చేరుకున్నారు. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శిఖరాగ్రానికి చేరుకోలేకపోయారు. 2026లో భారత పర్వతారోహణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన హై ఆల్టిట్యూడ్ ఎక్స్‌ప్లోరేటరీ ట్రెక్‌కు ఎంపికై విజయవంతంగా పాల్గొన్నారు. ఈ యాత్రలో సుమారు 66 కిలోమీటర్లు ప్రయాణించి 9,868 అడుగుల ఎత్తుకు చేరుకున్నారు. వీటితోపాటు వాటర్‌ఫాల్ రాపెల్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు...

చదువుతోపాటు పర్వతారోహణ...

ప్రస్తుతం హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ కోర్సు అభ్యసిస్తున్న

కార్తీక్ చదువుతోపాటు పర్వతారోహణపై ఆసక్తిని కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను రెపరెపలాడించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ప్రోత్సాహం అందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యువతకు ఆదర్శం

మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని యువతకు గిత్తే కార్తీక్ ప్రయాణం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సరైన లక్ష్యం, పట్టుదల, నిరంతర కృషి ఉంటే అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు సాధించవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. ఎమ్మెల్యే అందించిన ప్రోత్సాహం తనలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని కార్తీక్ పేర్కొన్నారు.

లొద్ది గూడ రోడ్డు బాగుకు చర్యలు

పంటల రవాణాకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేపడతాం

మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావు



జనినాదం,జైనూర్, సిర్పూర్(యు), నవంబరు 19: ధబోలి గ్రామపంచాయతీ పరిధిలోని లొద్ది గూడకు వెళ్లే రహదారి దుస్థితిని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు గురువారం పరిశీలించారు. వర్షాలకు రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రెండు రోజుల క్రితం గ్రామస్థులు, సర్పంచ్ మెస్రం నగేష్, మాజీ ఎంపీటీసీ మెస్రం బొజ్జు పటేల్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో చైర్మన్ కాలినడకన గ్రామానికి వెళ్లి దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. పంటలను విక్రయించేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం ఎడ్లబండ్లు వెళ్లేలా రోడ్డు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. జాడుగూడ నుంచి లొద్ది గూడ వరకు శాశ్వత బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. గ్రామానికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, నాయకులు మెస్రం అంబాజీరావు, ఆత్రం దత్తు, మెస్రం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో చందనోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

చొప్పదండి,నవంబర్ 19:జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జరుగుతున్న చందనోత్సవ మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ దేవస్థానాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, పార్కింగ్, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై పోలీసు అధికారులకు తగిన సూచనలు చేశారు.

ఇందిరాభీమా నమోదుపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.

జయశంకర్ భూపాలపల్లి,నవంబర్19: అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు, మార్గదర్శకాలు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పథకం అమలులో భాగంగా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించి నిర్దేశించిన అర్హతలు, నిబంధనల ప్రకారం నమోదు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గ్రామస్థాయి అధికారులు, ప్రత్యేక నమోదు కేంద్రాల ద్వారా, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాలు, ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం అందించి దరఖాస్తుల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నమోదు సమయంలో లబ్ధిదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు, మొబైల్ నంబర్ తదితర అవసరమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనాల నుంచి దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు పథకంపై అవగాహన కల్పించాలని



కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రజలందరూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన వివరాలు, నామినీ సమాచారంతో నమోదు చేసుకుని రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, సీపీఓ కిష్టయ్య, డీపీఓ శ్రీలక్ష్మీ, డీసీఎస్వో కిరణ్ కుమార్, అన్ని మండలాల మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈడీఎం, ఎంపీఎస్వోలు, ఏవోలు, ఎన్పీడీసీఎల్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందాలి
వైద్యధికారి పల్లవి

జననినాదం,తిర్యాణి నవంబరు 19: థైరాయిడ్ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందాలని తిర్యాణి పీహెచ్సీ డాక్టర్ పల్లవి (డీడీఓ) అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో గంభీరావుపేట సబ్సెంటర్ పరిధిలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో నలుగురిలో హైపోథైరాయిడిజం ఉన్నట్లు గుర్తించామని, మరో ముగ్గురిలో సంబంధిత లక్షణాలు కనిపించాయని పేర్కొన్నారు. వీరందరి నుంచి థైరాయిడ్ ప్రొఫైల్ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించి తదుపరి పరీక్షలకు పంపించినట్లు వివరించారు. గర్భిణుల కోసం నిర్వహించిన ఏఎన్సీ క్లినిక్లో 11 మందికి పరీక్షలు చేశామని, సాధారణ ఓపీ ద్వారా 63 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. ఎన్సీడీ



స్క్రీనింగ్తోపాటు అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించామని, మెరుగైన వైద్యం కోసం నలుగురిని తిర్యాణి సీహెచ్సీకి రిఫర్ చేసినట్లు చెప్పారు. ప్రజలు ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో స్టాఫ్నర్స్ సాజిదా బాను, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, మేల్ హెల్త్ అసిస్టెంట్, పీఎం జన్మన్ బృందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో నిర్వహణ

జయశంకర్ భూపాలపల్లి,నవంబర్ 19: భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రేగొండ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆ తర్వాత ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు కార్యకర్తల సమక్షంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కేక్ కట్ చేసి ఇందిరా గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు,



తదనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ అందించిన సేవలను, దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. దేశ చరిత్రలో ఆమె పోషించిన పాత్రను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కోడవటాంచ ఆలయ కమిటీ చైర్మన్ సంపత్ రావు, జిల్లా నాయకులు పుల్లూరి బాబురావు,వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మండల మరియు జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మరియు ప్రస్తుత ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత రైతుకు ఎమ్మెల్యే అండ

రూ.20 వేల ఆర్థిక సాయం.. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా

జననినాదం, బోత్ నవంబరు 19: ఆపదలో ఉన్న రైతులకు అండగా నిలుస్తామని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామానికి చెందిన రైతు షేక్ జావీద్ సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గురువారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో సుమారు 10 ఎకరాల్లోని పంట పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంట పొలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. బాధిత రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున కూడా తగిన పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల కష్టాల్లో భాగస్వాములై వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ



కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భార్యను వేధించి ఆత్మహత్యకు
కారణమైన భర్త అరెస్ట్



కరీంనగర్ రూరల్నవంబర్ 19: ఇరుకుల్ల గ్రామంలో ఈ నెల 9వ తేదీన వివాహిత శ్రావంతి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఆమె భర్త కొత్తూరి సంపత్ను రూరల్ పోలీసులు ఈరోజు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.11 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత రెండేళ్లుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలానికి చెందిన మహిళతో సంపత్కు అక్రమ సంబంధం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ మహిళ ఒత్తిడితో భార్యను వదిలించుకోవాలని సంపత్ తరచూ వేధిస్తున్నాడని, ఈ నెల 9వ తేదీ రాత్రి జరిగిన గొడవ తర్వాత మరునటి రోజు ఉదయం శ్రావంతి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి ఇమ్మడి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సంపత్ను ఈరోజు బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలోని జైలు బంక్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్,

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య.

కరీంనగర్ నవంబర్ 19: రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ ధ్యానం కొనుగోలు ప్రారంభం చేశారు. అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని బొమ్మకల్ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి... ధ్యానం తూకం వేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ కు రైతులు, రైతు సంఘ నాయకులు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ....రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ధ్యానం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. కొనుగోలు కేంద్రం లో రైతులకు అవసరమైన గన్ని బ్యాగులు, టార్పలిన్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కాంటా వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా రవాణా చర్యలు తీస్కువేలా



అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు తేమ శాతం లేకుండ ధాన్యం ఆరబెట్టాలని... తేమ శాతం లేకుండా ఉంటేనే సరైన ధర వచ్చే అవకాశం ఉందని సూచించారు. రైతులు కూడ నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని పిలుపు నిచ్చారు. రైతులు ధళారుల మాటలు నమ్మి మోసపోకూడదని సూచించారు. ?ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కార్పోరేటర్ మేకల వెంకటేష్, గాదే రూప శ్రీనివాస్, నాయకులు పురుమల్ల శ్రీనివాస్, రాంరెడ్డి, డైరెక్టర్లు బీరం ఆంజనేయులు, సాయిల్ల మహేందర్, బోనాల లింగయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెట్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్

టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాల తనిఖీలు

కరీంనగర్ నవంబర్ 19: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మించిన భవనాలకు అక్యూపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) జారీ చేసే ప్రక్రియలో భాగంగా, గురువారం నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలో విస్తృతంగా పర్యటించారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి నగరంలోని అల్కపురి, సదాశివపల్లి, కట్టరాంపూర్, మంకమ్మతోట తదితర ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయిన పలు భవనాలను కమీషనర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు.నగరంలో అక్యూపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవన యజమానులు మున్సిపల్ అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారా లేదా అన్న కోణంలో భవనాలను స్వయంగా పరిశీలించారు. తనిఖీలలో భాగంగా భవనాల చుట్టూ వదలవలసిన 'సెట్



బ్యాక్' స్థలాలు, వర్షపు నీటి సంరక్షణ కోసం తప్పనిసరిగా నిర్మించాల్సిన ఇంకుడు గుంతల ఏర్పాటును కమీషనర్ స్వయంగా పరిశీలించారు. అనుమతించిన ప్లాన్కు విరుద్ధంగా ఎలాంటి అదనపు నిర్మాణాలు ఉన్నా, నిబంధనలు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలన్నీ పక్కాగా పాటించిన భవనాలకు మాత్రమే నిబంధనల ప్రకారం అక్యూపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తేజశ్విని, అశ్విని సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనలో మంచిర్యాల జిల్లాకు 'సురక్షిత జిల్లా' గుర్తింపు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 19: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా 95:95:95 లక్ష్యాలను విజయవంతంగా సాధించిన మంచిర్యాల జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని 20 సురక్షిత జిల్లాల జాబితాలో స్థానం సంపాదించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధికారుల బృందం కలెక్టర్ ను శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం చూపిన అంకితభావం, సమర్థవంతమైన నాయకత్వం, వివిధ శాఖల మధ్య సమన్వయం, అందించిన సహకారంతో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, దిశ బృందం, వివిధ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లాలో హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు,



చికిత్స సేవలు, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టిగా కృషితో నిర్దేశిత లక్ష్యాలను సాధించగలిగామని తెలిపారు. హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతం చేయడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం, ప్రజలలో అపోహలను తొలగించి అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మంచిర్యాల జిల్లాను సురక్షిత జిల్లాగా కొనసాగించేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి జి ఎ సి ఎ సి ఎస్ జాయింట్ డైరెక్టర్ (ప్రివెన్షన్) కె.ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సుధాకర్ నాయక్, దిశ సిపిఎం నీలిమ, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సిఎస్ఓ రాజేష్, డీఎండీఓ సంతోష్, అధికారులు, మంచిర్యాల సంపూర్ణ సురక్ష కేంద్రం బృందం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా 'తొలిముద్ద' బ్రేక్ఫాస్ట్ కార్యక్రమంపై శిక్షణ.

జయశంకర్ భూపాలపల్లి,నవంబర్19: మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలో 3 నుండి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు చేపట్టిన తొలిముద్ద బ్రేక్ఫాస్ట్ కార్యక్రమం అమలులో భాగంగా గురువారం భూపాలపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు లో ఉప్మా మిక్స్, కిచిడీ మిక్స్ తయారీ మరియు వంట విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్కు చెందిన టీఎస్ ఫుడ్స్ ప్రతినిధి ఎన్. బాబు అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ అందించారు. ఉప్మా మిక్స్, కిచిడీ మిక్స్లలో ఉండే పోషక విలువలు, చిన్నారుల ఎదుగుదలకు వాటి ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా పిల్లలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా ఈ మిక్స్లను సరైన పద్ధతిలో ఎలా వండాలి, పిల్లలకు ఎలా అందించాలనే అంశాలపై డెమాన్స్ట్రేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ



సందర్భంగా చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి, భూపాలపల్లి సీడీపీఓ రాధిక, భూపాలవల్లి మరియు మహాదేవపూర్ ప్రాజెక్టుల సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

బాలలను కాపాడుకుందాం – అందరం కలిసి ముందుకు సాగుదాం

బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాల నిర్వహణ



మహబూబాబాద్,ప్రతినిధి (నవంబర్ 19:బాలల హక్కుల వారోత్సవాలు మరియు 'బాలలపై లైంగిక దాడుల వ్యతిరేక దినం' సందర్భంగా గురువారం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా చిన్నారుల రక్షణపై విస్తృత చైతన్య కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎఫ్.ఎం.ఎం. సామాజిక సేవా సంఘం (వరంగల్) ఆధ్వర్యంలో, 'షేర్' స్వచ్ఛంద సంస్థ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, బస్సు నిలయం కూడలి మరియు గురుకుల పాఠశాల ఆవరణలలో ప్రత్యేక సదస్సులు, ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ప్రచార రథం (మొబైల్ వ్యాన్) ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళారంజని సందీప్ కళా బృందం, అర్జున్ బృందం, కృష్ణం రాజు బృందాల కళాకారులు ఆటపాటలు, కళా ప్రదర్శనల ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా, '100 రోజుల బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారం'లో భాగంగా చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే బాలలపై జరిగే లైంగిక వేధింపులు, చరవాణి (సెల్‌ఫోన్) మరియు అంతర్జాలం (ఇంటర్నెట్) ద్వారా జరిగే సైబర్ మోసాల వట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆపద ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని, ఉచిత అత్యవసర సహాయ సంఖ్యలను (హెల్ప్‌లైన్) వినియోగించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎం.ఎం. సేవా సంఘం ప్రతినిధులు సమర, శిరీష, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏ హెచ్ టి యు) అధికారిణి అరుణ, భరోసా కేంద్రం ప్రతినిధి బేబీ, 'షేర్' సంస్థ ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటపాటల ద్వారా నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో పాటిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. స్థానిక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్వాహకులను అభినందించారు.

తెలంగాణ రక్షణ సేనలో పలువురు మహిళా నాయకుల చేరిక



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 19: తెలంగాణ రక్షణ సేనలోకి పలువురు మహిళా నాయకులు చేరారు. జిల్లా అధ్యక్షుడు కిర్మీళ్ల వినోద్ చారి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కాగజ్‌నగర్‌కు చెందిన దుర్గం రేవతి, కెరమెరికి చెందిన రాంటెంకి అక్షరతో పాటు పలువురు మహిళా నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రెబ్బెన మండలంలో తెలంగాణ రక్షణ సేన ప్రచారం..

కల్వకుంట్ల కవిత ప్రారంభించిన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేనను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో రెబ్బెన మండలంలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని రాజారాం, చిలుకమర్రిగూడ తదితర గ్రామాల్లో పర్యటించి పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిర్మీళ్ల వినోద్ చారి, రాష్ట్ర నాయకులు కావేటి అనోహర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్, టీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా మహిళ మహిళ జిల్లా అధ్యక్షురాలు దారవత్ పుష్పలత, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఉప్పరి నగేష్, ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు కొట్నాక కిషన్, టైగర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర ధర్ము, గిరిజన సంఘం నాయకులు వినోద్, తిరుపతి, మహిళా సంఘం నాయకులు రాంటెంకి అక్షర, దుర్గం రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

దేశ ఐక్యతకు విశేష కృషి చేసిన ఉక్కు మహిళ



జననినాదం,జైనూర్, సిర్పూర్(యు), నవంబరు 19: భారత తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గురువారం జైనూర్‌లో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షైక్ రషీద్, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధి, ఐక్యత, సమగ్రత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆమె ధైర్యసాహసాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావి మనోహర్, పావర్‌గూడ సర్పంచ్ తొడసం రాజేందర్, గౌరీ నర్పంచ్ ఆత్రం అయ్యుబాయి భుజంగ్‌రావు, మెస్రం అంబాజీ, రాథోడ్ హరి, పెందూర్ ప్రకాశ్, షైక్ రహీమ్, భుజంగ్‌రావు, కిరణ్, విక్రమ్, మండాడి లింగు, సిద్ధ, ఆత్రం దత్తు, మెస్రం ఇంద్రు, శంకర్, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ విశ్వబోధి గాయక్వాడ్



జననినాదం,సిరికొండ 19: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ విశ్వబోధి గాయక్వాడ్ అన్నారు. గురువారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి ఇందిరాగాంధీ అందించిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ పురోగతికి, ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జీజీహెచ్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 19: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ అధ్యక్షతన జీజీహెచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నాలుగేళ్లుగా వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. జీఓ నం.6 ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు.కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను మినహాయించి ఖాతాల్లో పూర్తిస్థాయిలో జమ చేయడం లేదని ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఏటా నెల వేతనం బోనస్‌గా ఇవ్వాలని, చట్టబద్ధమైన సెలవులు, రెండు జతల యూనిఫారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన హామీ మేరకు వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆసుపత్రి సేవలను స్తంభింపజేసేలా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, మాధవి, సువర్ణ, సాంబాజీ, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనతోనే నాణ్యమైన విద్య

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఏసీఎంఓ పి. ఉద్ధవ్



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 19: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ మొబిలైజింగ్ ఆఫీసర్ (ఏసీఎంఓ) పి. ఉద్ధవ్ అన్నారు. గురువారం దంతన్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని భీమ్‌జీగూడ, బుగ్గగూడ, చింతనమాదర, మర్కగూడ, నాగుగూడ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, వారి స్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బోధనా ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను సకాలంలో పూర్తి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించేలా అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సీఆర్పీ కనక కైలాస్ పాల్గొన్నారు.

కస్తూరిభాలో వేధింపులకుగురవుతున్నానని

వాచ్‌వుమెన్ ఆరోపణ...

విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 19: బెజ్జూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో వాచ్‌వుమెన్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి, తాను వేధింపులకు గురవుతున్నానని ఆరోపించారు.తనకు కేటాయించిన విధులకు మించి పనులు చేయిస్తున్నారని, విధుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె తెలిపారు. గత 20 సంవత్సరాలుగా ఇదే హాస్టల్‌లో వాచ్‌వుమెన్‌గా పనిచేస్తున్నానని, గతంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని ఆమె చెప్పారు.ప్రస్తుత ఎస్ఓ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాజేశ్వరి ఆరోపించారు. తనకు కేటాయించిన విధులను నిర్వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అయినప్పటికీ వ్యక్తిగత పనులు చేయిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు, గురుకుల ఉన్నతాధికారులు స్పందించాలని రాజేశ్వరి కోరారు. హాస్టల్‌లో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు తెలుసుకోవాలని, తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

33 కేవీ దహెగాం-కన్నెపల్లి ఇంటర్ లింకింగ్ లైన్ ఛార్జింగ్...

విద్యుత్ సరఫరా మరింత మెరుగు... డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి. మోహన్ రావు



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 19: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్ పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు నిర్మించిన 33 కేవీ దహెగాం–కన్నెపల్లి ఇంటర్ లింకింగ్ లైన్ ను గురువారం సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. మోహన్ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్ విజయవంతంగా ఛార్జింగ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ, సుమారు 18 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఈ లైన్ ద్వారా కాగజ్ నగర్ 132/33 కేవీ సబ్ స్టేషన్ లోని 33 కేవీ దహెగాం ఫీడర్ ను బెల్లంపల్లి 132/33 కేవీ సబ్ స్టేషన్ లోని 33 కేవీ కన్నెపల్లి ఫీడర్ తో అనునంధానం చేశామని చెప్పారు.ట్రాన్స్ కో విభాగం చేపట్టే 132 కేవీ లైన్ నిర్వహణ పనులు, లైన్ క్లియరెన్స్ (ఎల్ సీ) సమయంలో కాగజ్ నగర్, బెల్లంపల్లి డివిజన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా మార్గంగా ఈ ఇంటర్ లింకింగ్ లైన్ ఉపయోగపడుతుందన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.టీజీఎన్ పీడీసీఎల్ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ నెట్ వర్క్ ను నిరంతరం బలోపేతం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఈ (ఆపరేషన్స్) ఆసిఫాబాద్ జాడే ఉత్తమ్, జీఎం ప్రభావతి, డీఈఈ (ఆపరేషన్స్) సిర్పూర్–కాగజ్ నగర్, ఏడీఈ (ఆపరేషన్స్), దహెగాం ఏఈతో పాటు సంబంధిత సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం... కెరమెరిలో ఘనంగా జయంతి వేడుకలు



జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు),నవంబరు 19: భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కెరమెరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ ధైర్యసాహసాలతో కూడిన నాయకత్వం, ప్రజాసేవ, దేశాభివృద్ధికి ఆమె చేసిన విశేష కృషి నేటి తరానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె ఆశయాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కెరమెరి మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ సిడం జగన్నాథ్, ఆత్మ కమిటీ సభ్యుడు గోగర్ల రాజయ్య, డీసీసీ జిల్లా కార్యదర్శి రాథోడ్ శంకర్, జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ ఫారూక్, కరంజీవాడ సర్పంచ్ రాథోడ్ బలవంత్, బోరిలాల్ గూడ సర్పంచ్ చవాన్ శంకర్, షేక్ బాబు, కోట్రంగే హనుమంతు, అయూబ్ ఖాన్, అంబాజీ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెగడపల్లిలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



పెగడపల్లి (ధర్మపురి),నవంబర్ 19 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భారత మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి మాట్లాడుతూ...భారతదేశ ప్రగతికి, దేశ సమగ్రతకు విశేష సేవలు అందించిన మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించడం మనందరికీ గర్వకారణమన్నారు. దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని, ఇందిరా గాంధీ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు.ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని, ఆమె ప్రవేశపెట్టిన సంక్షేమ విధానాలు దేశాభివృద్ధికి బాటలు వేశాయని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆమె ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఏఎంసీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లగందల్ లో ఉజ్వల గ్రామ మహిళా సంఘం నూతన భవనం ప్రారంభం



కొత్తపల్లి మండలం నవంబర్ 19: కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలో ఉజ్వల గ్రామ మహిళా సంఘం నూతన భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీడీవో , ఏఈ, ఏపీఎం, ఏపీఓ, సీసీలు, ప్రజా ప్రతినిధులు, మండల సమాఖ్య ఆఫీస్ బేరర్స్, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్స్, మండల వివోఏ లు హాజరయ్యారు. నూతన భవన ప్రారంభంతో మహిళా సంఘ సభ్యులకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సొంత వేదిక ఏర్పడిందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293. **Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197